క్లుప్తంగా

పంట బీమా తప్పనిసరి

కుప్పంరూరల్: శాంతిపురం మండలంలోని రైతులు డిసెంబర్ 15వ తేదీ లోపు పంట బీమాను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వరి ఎకరాకు రూ.630, వేరుశనగకు రూ.480, టమాట ఎకరాకు రూ.1,600 చెల్లించాలని వెల్లడించారు. వరికి రూ.42వేలు, వేరుశనగకు రూ.30 వేల వంతున ఎకరాకు ఇన్సూరెన్స్ కవరేజీ అవుతుందని వివరించారు. మినుములు, జొన్న, పెసర పంటలకు కూడా ఇన్సూరెన్స్ కవరేజీలు ఉన్నాయని,వివరాలకు వ్యవసాయశాఖ కార్యాలయం, రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇనుప బెంచీల వితరణ


దాతలతో వైద్యులు

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి దాతలు సీతారామయ్య, నరేంద్ర, సునీల్, త్యాగరాజులు, వాసవి మహిళా మండలి వారు రూ.30 వేలు విలువజేసే ఇనుప బెంచీలను శనివారం వితరణగా అందజేశారు. ఈసందర్భంగా దాతలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మమతారాణి, ఆర్ఎంఓ శారద, వైద్యులు ఘనంగా సన్మానించారు.

విద్యుత్ లేన్లకు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పుంగనూరు: పట్టణంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ లేన్లను మరమ్మతులు చేసే కార్యక్రమం చేపట్టినట్లు ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. పట్టణంలోని షిరిడీ సాయినగర్, కోర్టు రోడ్డు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో వాటిని సరిచేసినట్లు తెలిపారు. విద్యుత్ లేన్లపై ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించినట్లు వివరించారు. కార్యక్రమంలో లైన్‌మన్ మోహన్‌కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ వలంటీర్లు


పలమనేరు: ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.వెంకటేశులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. అంతకుముందు వలంటీర్లు మార్చ్‌ఫాస్ట్ చేశారు. ఈసందర్భంగా 56 యూనిట్ల రక్తాన్ని సేకరించి చిత్తూరు వైద్యశాఖ రక్తనిధికి ఇచ్చినట్టు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్థానిక నిర్వాహకులు డా. యుగంధర్, డా.మల్లికార్జునరెడ్డి, అరుణ్‌కుమార్, డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధికారులు బాలాజీ, వెంకటేష్‌బాబు, జయశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథంతో పనిచేయాలి


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: ఎన్‌సీసీలో చేరిన ప్రతి విద్యార్థి సామాజిక దృక్పథంతో పనిచేయాలని సీఐ శ్రీనివాసులు కోరారు. స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ వేడుకలను ప్రిన్సిపల్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరై, ఎన్‌సీసీ విద్యార్థులు సామాజిక స్పృహతో సమాజంలో అవసరమైన సమస్యలను గుర్తించి, పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజన తండాల్లో ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఎన్‌సీసీ విద్యార్థులు కృషిచేయాలని చెప్పారు. ఎన్‌సీసీ విద్యార్థులకు సీఐ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సోమరాజు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి


అన్నదానం చేస్తున్న సమితి సభ్యులు

వి.కోట: శ్రీభగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా శనివారం వి.కోట సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సత్యసాయి హైస్కూల్‌లో సాయిబాబా, షిరిడీ బాబావారి చిత్రపటాలను ఉంచి పూజలు నిర్వహించి భజనలు చేశారు. అనంతరం స్థానిక కేజీఎఫ్ బస్టాండ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సమితి సభ్యులు చంద్రశేఖర్, ఆర్ముగం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా..!

లక్ష్యం మంచిదే అయినా చిత్తశుద్ధి లోపిస్తే ఫలితం ఉండదు. సక్రమంగా పర్యవేక్షణ లేకుంటే ప్రజాధనం వృథాగా మారుతుంది. ఇందుకు కుప్పం మండలంలో నిర్మించిన వర్మీకంపోస్టు కేంద్రాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. రూ.కోటికి పైగా వెచ్చించి అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ సెంటర్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద సంగతి దేముడెరుగు.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారయ్యాయి. ఇంటింటికి వెళ్లి వ్యర్థాలు సేకరించేందుకు తీసుకొచ్చిన వాహనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారిపోయాయి.

- నిరుపయోగంగా వర్మీకంపోస్టు సెంటర్లు
- చెత్త నుంచి తయారు కాని సంపద
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు


వానగుట్టపల్లె నిరుపయోగంగా వర్మీకంపోస్టు

కుప్పంరూరల్: చెత్త నుంచి సంపద సృష్టించి తద్వారా పంచాయతీలకు ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో 2017–18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బృందావనాల పేరిట వర్మీకంపోస్టు సెంటర్లు నిర్మించింది. కుప్పం మండలంలో ఈ కేంద్రాల నిర్మాణానికి రూ.1,30,55,000 మంజూరు చేసింది. అందులో రూ. 1,01,11,345 వెచ్చించి మొత్తం 21 కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే చెత్త సేకరణకు ఒక్కో పంచాయతీకి చక్రాల సైకిల్, ఎలక్ట్రిక్ ఆటోను అందించింది. చెత్తను తరలించేందుకు స్వచ్ఛదూత్‌ను ఏర్పాటు చేసింది. అంతా బాగానే ఉన్నా ఆచరణలో అలసత్వం కారణంగా వర్మీకంపోస్టు సెంటర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

నీరుగారిన లక్ష్యం

పంచాయతీల్లో ఇంటింట చెత్త సేకరించేందుకు అప్పట్లో చర్యలు చేపట్టారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వర్మీకంపోస్టు సెంటర్‌కు తరలించేవారు. అక్కడ తడి చెత్తను ఎరువుగా మార్చి రైతులకు విక్రయించేవారు. తద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చేది. అయితే ఈ ప్రక్రియ తొలినాళ్లలో సక్రమంగానే సాగింది. క్రమేణా చెత్తను వేరు చేయడంపై సిబ్బందికి అవగాహన లేకపోవడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. మూడు చక్రాల సైకిల్, ఆటోలు మూలన పడి తుప్పు పడుతున్నాయి. స్వచ్ఛదూత్‌లకు జీతాలు చెల్లించకపోవడంతో వారు ఇంటి ముఖం పట్టారు. దీంతో లక్ష్యం నీరుగారి ప్రారంభించిన కొద్దిరోజులకే వర్మీకంపోస్టు కేంద్రాలు మూతపడ్డాయి.



కేడీ పల్లెలో డంపింగ్ యార్డు, మూలపడిన చెత్త సేకరణ ఆటో

ఆకతాయిల నిలయంగా..

చెత్త నుంచి సంపద సృష్టి కథ కంచికి చేరడంతో వర్మీకంపోస్టు కేంద్రాలు ఆకతాయిలకు నిలయంగా మారిపోయాయి. మందుబాబులకు బార్‌లాగా, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారయ్యాయి. వీటిలో కొన్ని నిర్మాణాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఆయా కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని ప్రజాధనం వృథా కాకుండా చూడాలని గ్రామీణులు కోరుతున్నారు.


ఎక్కడ చూసినా తాగి పడేసిన మద్యం సీసాలే!

పట్టుపరిశ్రమను ఆదుకోండి సారూ!

- సెరికల్చర్ డైరెక్టర్‌ను కలిసిన రైతులు, రీలర్లు


డైరెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న పట్టు రైతులు

పలమనేరు: పలమనేరు సబ్‌డివిజన్‌కు చెందిన పట్టు సాగుచేసే రైతులు, రీలర్ల సంఘ నేతలు గుంటూరులోని సెరికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులును కలిసి ఇక్కడి సమస్యలను విన్నవించినట్టు పట్టు ఉత్పత్తిదారుల సంఘ నాయకులు ఏడూరు గురుమూర్తి శనివారం తెలిపారు. గతంలో పట్టు రైతులకు అందుతున్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇప్పుడు రావడం లేదని, దీనికి తోడు కూలీల ఖర్చులు పెరుగుతున్నా గూళ్ల ధరలు మాత్రం పెరగడం లేదని తెలిపామన్నారు. దీంతో జిల్లాలో మల్బరీ సాగు తగ్గుతోందని చెప్పామన్నారు. జిల్లాలో ఈక్రాప్ మేరకు మల్బరీ సాగు విస్తీర్ణం 12,500 ఎకరాలుగా ఉండగా సెరికల్చర్ అధికారులు మాత్రం తక్కువ విస్తీర్ణం చూపారని విన్నవించామని తెలిపారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పట్టు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మరోవైపు రీలర్లు సైతం వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

పలమనేరు: మరుగుదొడ్ల వినియోగంపై స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం, మానవహారం, ర్యాలీ జరిగాయి. ఎంపీడీఓ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బహిరంగ మల, మూత్ర విసర్జన కారణంగా అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందరూ మరుగుదొడ్లనే వాడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఓడీఎఫ్ అనే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కన్సల్టెంట్ శాంతి, ఏఈ లోకనాథం, హెచ్ఎం షంషీర్, మండల కో–ఆర్డినేటర్ సిద్ధారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫారం పాండ్‌కు రాయితీ


పంటను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

బైరెడ్డిపల్లి: ఫారం పాండ్ నిర్మాణానికి రూ.75 వేల వరకు రాయితీ ఉందని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాతురునత్తంలో శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి బంగాళదుంప పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నీటి కొరతను అధికమించడానికి పొలాల్లో ఫారంపాండ్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. రాయితీ సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తీగ జాతి కూరగాయలు సాగు చేసే రైతులు 10 అడుగుల రాతి కూసాలు నాటి జీఏ కమ్మీ అల్లి శాశ్వత పందిరి ఏర్పాటు చేసుకున్నట్లయితే ఉద్యానశాఖ ద్వారా ఎకరాకు రూ.లక్ష రాయితీ ఉందన్నారు. పథకాలను వినియోగించుకోవడానికి ఉద్యానశాఖ అధికారులను, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఉద్యానవనశాఖాధికారిణి లక్ష్మీప్రసన్న, జయశ్రీ పాల్గొన్నారు.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా మహిళలు

వి.కోట: ప్రభుత్వం మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఐద్వా ఆధ్వర్యంలో విశాఖ లా స్టూడెంట్‌పై జరిగిన సామూహిక లైంగికదాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కోల్‌కతా ట్రైనీ డాక్టర్ ఘటన మరవకముందే విశాఖలో లా విద్యార్థినిపై జరిగిన దాడి చూస్తే చట్టాలు ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నాయని, ఆచరణలో శిక్షలు పడకుండా కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. హోంశాఖా మంత్రి మహిళగా ఉన్నప్పటికీ మహిళలకు ఏ మాత్రం న్యాయం జరగడంలేదన్నారు. మద్యం, మత్తుపదార్థాలను నియంత్రించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకురాళ్లు అనిత, శ్యామల, జీవిత పాల్గొన్నారు.

ఆహార సంరక్షణపై అవగాహన

రొంపిచెర్ల: విద్యతోపాటు పోషక విలువలతో కూడిన ఆహార సంరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఫుడ్ ప్రాసెసింగ్ ఒకేషనల్ ట్రైనర్ పి.జయంతి అన్నారు. కేజీబీవీ విద్యార్థులకు శనివారం రొంపిచెర్ల సర్కిల్‌లో ఆహార సంరక్షణపై అవగాహన కల్పించారు. జయంతి మాట్లాడుతూ ఆహార పదార్థాలు ఎలా తయారు చేయాలో ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. అదేవిధంగా బేకరీ పదార్థాలను సొంతంగా ఎలా తయారు చేసుకోవాలో అనే అంశాన్ని బేకరీ తయారీదారులతో అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ తయారు చేసిన పదార్థాలను రుచి చూసి పరిశీలించారు. కేజీబీవీ ఎస్ఓ సుజాత, ఇంగ్లిష్ అధ్యాపకురాలు మునిఇంద్రాణి పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి


ఫారం పాండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వి.కోట: రైతులు నీటి కొరతను అధిగమించడానికి పొలంలో ఫారంపాండ్ నిర్మించుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్ సూచించారు. శనివారం ఆయన మండల అధికారులతో కలసి పెద్దబర్నిపల్లి, కొంగాటం గ్రామాల్లో రైతులు ఏర్పాటు చేసిన ఫారంపాండ్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫారంపాండ్ నిర్మాణానికి రూ.75 వేల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యానశాఖాధికారిణి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యపరీక్షలు

పలమనేరు: పట్టణంలోని ఏపీఎన్జీఓ భవనంలో డా.అగర్వాల్ ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా స్థానిక లయన్స్ సేవా కేంద్రంలోనూ ఉచిత కంటి పరీక్షలను నిర్వహించి ఆపరేషన్లు చేయనున్నట్టు నిర్వాహకులు జయశంకర్ మరో ప్రకటనలో తెలిపారు.

వాలీబాల్ పోటీలు నేడు

చౌడేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం కోయంబత్తూరుకు చెందిన ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16వ గ్రామోత్సవ రూరల్ ప్రీమియం లీగ్ వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తిగల యువకులు ఉన్నత పాఠశాల ఆవరణలోకి ఉదయం 7 గంటలకు చేరుకోవాలన్నారు. విజేతలకు బహుతులు అందజేయనున్నట్లు తెలిపారు.

భూ తగాదాలు పరిష్కరించాలి


చౌడేపల్లెలో విచారణ చేస్తున్న ఆర్డీఓ భవాని

చౌడేపల్లి: భూ తగాదాలపై వచ్చిన అర్జీలను విచారణ నిర్వహించి సత్వరమే పరిష్కరించాలని పలమనేరు ఆర్డీఓ భవాని అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె చౌడేపల్లెలో పర్యటించారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఆమె స్థలాన్ని సందర్శించారు. ఇరువర్గాల వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ స్థలాల సంరక్షణకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ హనుమంతునాయక్, సర్వేయర్ గుణశేఖర్ వీఆర్వోలు మల్లికార్జునరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ కాపు సంఘం ప్రచార కమిటీ కన్వీనర్ హరికుమార్


హరికుమార్

బైరెడ్డిపల్లి: ఆంధ్రప్రదేశ్ జాతీయ కాపు సంఘం ప్రచార కమిటీ కన్వీనర్‌గా బైరెడ్డిపల్లెకు చెందిన డీఆర్.హరికుమార్‌ను నియమిస్తూ జాతీయ కాపు సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ కాపు సంఘంలో చోటు కల్పించడంతో తమ వంతు సహాయ సహకారాలు అందించి కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషిచేస్తానని హరికుమార్ తెలిపారు.

ఆరోగ్య రక్షణపై సదస్సు


మాట్లాడుతున్న అనంత్

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఎంసీఏ కళాశాలలో మహిళా సాధికారత, ఆరోగ్య సంరక్షణ అనే అంశంపై ఒక రోజు అవగాహన సదస్సును కళాశాలలో శనివారం నిర్వహించారు. ఇందులో కుప్పం ఫెమిక్ కంపెనీ సీసీఈఓ అనంత్ హాజరై మహిళల అభ్యున్నతి, సాధికారతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల కరెస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రొంపిచెర్ల: మండలంలోని ప్రతి ఆలయంలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్ఐ సుబ్బారెడ్డి ఆలయ ధర్మకర్తలకు సూచించారు. ఆలయాల్లో విలువైన విగ్రహాలు, బంగారు, వెండి నగలు, హుండీ కానుకలు ఉంటాయని అన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సీసీ కెమెరాలు, లేదంటే స్మార్ట్‌లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

సారా కేసులో ముగ్గురి అరెస్ట్

పుంగనూరు: మండలంలోని పూజగానిపల్లి వద్ద అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, వేణుగోపాల్‌రెడ్డితో కలసి దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో నల్లగుట్లపల్లె తండాకు చెందిన బాలాజీనాయక్‌ను పట్టుకుని, అతని నుంచి 90 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు. నల్లగుట్లపల్లెతండాకు చెందిన బుడ్డన్ననాయక్, పెద్దతాండాకు చెందిన బుక్యాశంకర్‌నాయక్‌ను పిలిపించి బైండోవర్ చేయించామన్నారు. వీరి వద్ద సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

కడపనత్తం విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనత్తం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వేదాంత్, సౌమ్య, మౌనిక అండర్–14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటేష్, పీడీ చిరంజీవి తెలిపారు. బంగారుపాళ్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 24, 25 తేదీల్లో అరగొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

నెట్టిబండలో స్వయం సహాయక సంఘాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


మహిళలతో సమావేశమైన వెలుగు సిబ్బంది

చౌడేపల్లి: మండలంలోని దిగువపల్లె పంచాయతీ నెట్టిబండలో రెండు మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసినట్లు వెలుగు ఏపీఎం సుబ్రమణ్యం శనివారం తెలిపారు. యానాదులు ఎదుర్కొంటున్న కష్టాలు, వివిధ సమస్యలను వివరిస్తూ ఈనెల 18న 'ఎదుగు లేని బతుకు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తాగునీటి సమస్య, వీధి దీపాల ఏర్పాటు, ఆధార్, బర్త్‌సర్టిఫికెట్ల సమస్యను పరిష్కరించారు. శనివారం వెలుగు సిబ్బంది యానాదుల మహిళలతో సమావేశమయ్యారు. రెండు సంఘాలను ఏర్పాటుచేయడంతో పాటు సంఘాల వలన కలిగే ప్రయోజనాలను వివరించి వారిలో చైతన్యం కల్పించారు. సీసీ సుగుణ పాల్గొన్నారు.

గోకులం షెడ్ల పనులు వేగవంతం


మాట్లాడుతున్న ఎంపీడీఓ లీలామాధవి

చౌడేపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన మినీ గోకులం పశువుల షెడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ లీలామాధవి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ, పశుసంవర్ధకశాఖ సిబ్బందితో సమన్వయంగా సమావేశం నిర్వహించారు. షెడ్ల నిర్మాణ పనులు మంజూరైన రైతులు 40 రోజుల్లోపు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పంచాయతీ వారీగా ప్రగతిపై సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కొలతలు, నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. పని ప్రారంభం నుంచి నాలుగు దశల్లో ఫొటోలు సేకరించి దశల వారీగా బిల్లులు చెల్లించడానికి ఉపాధి సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు చేశారు. సమావేశంలో పశువైద్యాధికారులు పవన్‌కుమార్, దినేష్‌రెడ్డి, ఏపీఓ చిన్నరెడ్డెమ్మ, జేఈ కోదండపాణి పాల్గొన్నారు.

సమన్వయంతో ఆరోగ్యానికి సంరక్షణ


మాట్లాడుతున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లి: వైద్యశాఖ, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి సంరక్షణ సాధ్యమని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాకార్యకర్తలతో సమన్వయంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భవతి దశ నుంచి బిడ్డ పుట్టే వరకు రెండు శాఖల సమన్వయంతోనే సాధ్యమవుతుందన్నారు. పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మాతృశిశు మరణాలతోపాటు, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీఓ లీలామాధవి సూచించారు. సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన, బహుద్దీన్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనాన్ని కూడా అందించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం మండలంలోని ఖాజీపేట ఉర్దూ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని, వంట గదిని, స్టోర్‌రూంను పరిశీలించారు. విద్యార్థులను అడిగి నాణ్యత గురించి తెలుసుకున్నారు. సమస్యలుంటే ధైర్యంగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.

బహిరంగ మలవిసర్జన చేయరాదు


మానవహారంలో విద్యార్థులు

గంగవరం: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని మండలంలోని కీలపట్ల గ్రామంలో పంచాయతీ అధికారులు శనివారం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టి మరుగుదొడ్ల వినియోగంపై నినాదాలు చేస్తూ గ్రామంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఐఈసీ జిల్లా కన్సల్టెంట్ శాంతి మాట్లాడుతూ బహిరంగ మలమూత్ర విసర్జన వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వాటి నిర్మూలనకు ప్రతిఒక్కరూ తమ నివాసాల్లో మరుగుదొడ్లు నిర్మించుకుని వాటినే వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, గ్రామీణ నీటిపారుదలశాఖ అధికారి లక్ష్మీసుధ, హెచ్ఎం దామోదర్, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.